
క్లుప్తంగా

ఘనంగా శివపార్వతుల కల్యాణం



ఆకట్టుకున్న దీపాలంకరణ

పాలకొండ: పట్టణంలోని నక్కలపేటలో ఉన్న షిర్డీ సాయి సహిత సకల దేవతల ఆలయంలో శివ పార్వతుల కల్యాణం గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో లక్ష దీపాలతో పలు దేవతామూర్తుల రూపాలను మహిళలు అలంకరించారు.

వీఆర్‌ఓల పర్యవేక్షణలో రేషన్

భామిని: మండలంలోని 9 ఎండీయూ నిత్యావసర సరుకుల పంపిణీ వాహనాల చెంత రేషన్ సరుకుల అందజేతలో వీఆర్‌ఓల పర్యవేక్షణ ఉంటుందని తహసీల్దార్ నీలాపు అప్పారావు గురువారం తెలిపారు. ఈ మేరకు వీఆర్‌ఓలకు ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. ప్రజలు సక్రమంగా నిత్యవసర సరుకులు పొందాలని కోరారు. గ్రామ వలంటీర్ విధిగా సరుకుల పంపిణీలో భాగం పంచుకోవాలన్నారు.

వేపారమ్మకు చల్లదనం

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని వేపారమ్మ తల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం శుక్రవారం నిర్వహించనున్న నేపథ్యంలో గురువారం చల్లదనం కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ బి. గౌరీశంకరరావు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, మహిళలు అమ్మవారికి ముర్రాటలు సమర్పించారు. మేళ తాళాలతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించాలి



వీరఘట్టం బాలికోన్నత పాఠశాలలో జరిగిన కాంప్లెక్ సమావేశంలో పాల్గొన్న సైన్స్ ఉపాధ్యాయులు

వీరఘట్టం: విద్యార్థులు నైపుణ్యం పెంపొందించేలా బోధన చేపట్టాలని ఎంఈఓ డి.గౌరి నాయుడు పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో గురువారం జరిగిన సైన్స్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు.తరగతి గదిలో ప్రయోగాత్మకంగా బోధన చేపట్టి విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధన చేపట్టి వారి నుంచి ఉత్తమ ఫలితాలను రాబట్టవచ్చని సూచించారు.

అలాగే స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గణితం సబ్జెక్టుపై, తలవరం హైస్కూల్‌లో సోషల్ సబ్జెక్టుపై కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించారు.ఎంఈఓ-2 ఆర్.ఆనందరావు,ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ఉప్పాడ అప్పారావు, బి.సాంబర, కేపీ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గురుదత్త హోమం



హోమంలో పాల్గొన్న భక్తులు

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని షిర్డీ సాయి బాబా ఆలయంలో గురుదత్త హోమాన్ని భక్తిశ్రద్ధలతో గురువారం నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, కాకడ హారతి, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం వీరఘట్టంనకు చెందిన ప్రముఖ యజ్ఞకర్త ఎస్‌వీఎల్‌ఎన్ శర్మయాజీ సహకారంతో జై గురుదత్త హోమం నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన దంపతులు పాల్గొన్నారు.

గురజాడకు ఘనంగా నివాళులు

సీతంపేట: గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో గురజాడ వెంకట అప్పారావు వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురజాడ చిత్రపటానికి హెచ్‌ఎం ఎ. లిల్లీరాణి, తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక సాధికార యాత్ర సక్సెస్

- నూతనోత్తేజంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు



బస్సుయాత్రలో భాగంగా మేడ ఎక్కి నాయకులను చూస్తున్న ప్రజలు (ఫైల్)

కురుపాం: కురుపాం నియోజకవర్గ కేంద్రంలో బుధవారం జరిగిన వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర సక్సెస్ కావడంతో ఆ పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజం నెలకొంది. ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి, పార్వతీపురం మన్యం జిల్లా పార్టీ అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు ఆధ్వర్యంలో జరిగిన యాత్ర అనుకున్న దాని కంటే విజయవంతమైంది. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి భారీ సంఖ్యలో పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, నాయకులు, ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చారు. సభకు హాజరైన రాష్ట్ర మంత్రులకు, నాయకులకు, ఎమ్మెల్యేలకు భారీ ఎత్తున బైకు ర్యాలీతో ఘన స్వాగతం పలికారు. బహిరంగ సభలో అంచనాలకు మించి ప్రజలు పాల్గొనడంతో పార్టీ శ్రేణులు సంబరపడుతున్నాయి. సభలో పార్టీ నేతలు రాష్ట్రంలో గడిచిన నాలుగున్నరేళ్లలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని సవివరంగా వివరించారు. ఈ సమయంలో ప్రజలు జై జగన్.. జైజై జగన్ అంటూ నినదించారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా నియోజకవర్గంలో దశాబ్దాలుగా నోచుకోని అభివృద్ధి గడిచిన నాలుగున్నరేళ్లలోనే జరగడంతో ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, పార్టీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు కృషి చేయడంతోనే సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో సాగిందని సభకు హాజరైన ప్రజలు పేర్కొనడం విశేషం.



సభలో మాట్లాడుతున్న కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి(ఫైల్)

రూ.20లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం

పాలకొండ రూరల్: మండలంలోని లుంబూరు గ్రామంలో ఇటీవల ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రంత్ గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అక్కడి సచివాలయ పరిధిలో గరుగుబిల్లి, లుంబూరు గ్రామాల ప్రజలు పలు సమస్యలు విన్నవించారు. వీటిపై స్పందించిన ఎమ్మెల్యే జీజీఎంపీ నిధులను రూ.20 లక్షలు కేటాయించారు. ఈ నిధులతో ఏడు చోట్ల కాలువలు, సీసీ రహదారుల నిర్మాణానికి అక్కడి ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు నిర్ణయించారు. గురువారం సర్పంచ్ తిర్లంగి ఉపేంద్రకుమార్, ఉప సర్పంచ్ పడాల రమచంద్రరావు, రౌతు వాసునాయుడు తదితరుల నేతృత్వంలో ఈ పనులకు శంకుస్థాపన చేసారు. ప్రజల కోరిక మేరకు త్వరలో అభివృద్ధి పనులు పూర్తి చేస్తామన్నారు.



జీజీఎంపీ నిధులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ తదితరులు

నగర పంచాయతీ అభివృద్ధికి సహకరించాలి

పాలకొండ: నగర పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు కోరారు. నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం గురువారం నిర్వహించారు. చైర్‌పర్సన్ యందవ రాధాకుమారి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పలు అభివృద్ధి పనులకు తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కౌన్సిల్ సభ్యులు పూర్తి సహకారం అందించి ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు సూచనలు అందించాలని కోరారు. సమావేశంలో కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

జగన్‌తోనే జన రంజక పాలన



బుక్కూరులో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కళావతి

- ఎమ్మెల్యే కళావతి

పాలకొండ రూరల్: రాష్ట్రంలో జన రంజక పాలన అందిస్తున్న సీఎం జగనన్నను ప్రజలు నిండు మనసుతో మళ్లీ ఆశీర్వదించాలని ఏపీ శాసనసభ ఆర్థిక వ్యవహారాల అంచనాల కమిటీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని బుక్కూరులో సర్పంచ్ టి.సుందరమ్మ అధ్యక్షతన గురువారం చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ బొమ్మాళి భానుతో ప్రతీ గడపకు వెళ్లారు. గడిచిన నాలుగున్నరేళ్లగా తమ ప్రభుత్వం అర్హులకు సమకూర్చిన సంక్షేమ లబ్ధిని క్షుణ్ణంగా వివరించారు. ఈ క్రమంలో ప్రజలు విన్నవించిన సమస్యల పరిష్కారానికి జీజీఎంపీ నిధుల ద్వారా పరిష్కారం చూపిస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు కనపాక సూర్యప్రకాష్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లోలుగు విశ్వేశరరావు, ఎంపీటీసీ పిన్నింటి లక్ష్మి, ఉప సర్పంచ్ వంజరాపు కొండలరావు, నాగవంశపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నల్లి శివప్రసాద్, మిత్తువాడ సంఘంనాయుడు, కనుముల దాము, సూర్యనారాయణ, ఎంపీడీఓ డొంక త్రినాధులు, ఈఓపీఆర్డీ సూర్యనారాయణ, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ ప్రవళిక, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వెయిట్‌లిఫ్టింగ్‌లో విద్యార్థుల ప్రతిభ

జియ్యమ్మవలస: స్కూల్ గేమ్స్ రాష్ట్ర అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో నిర్వహించిన వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో చినమేరంగి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు కె.సుధీర్, ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ జి.శివప్రసాద్ గురువారం తెలిపారు. 61 కేజీల కేటగిరి యూత్‌లో ద్వితీయస్థానం, జూనియర్‌లో తృతీయస్థానం, 55 కిలోల కేటగిరీ యూత్‌లో గోల్డ్‌మెడల్, జూనియర్‌లో సిల్వర్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా ఉమ్మడి విజయనగరం జిల్లా ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి ఎం ఆదినారాయణ విజేతలైన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో సివిక్స్ అధ్యాపకుడు వీకేజీ మహరాణా, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఉన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఉమ్మడి విజయనగరం జిల్లా ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి ఆదినారాయణ

నిర్దేశిత సమయంలోగా పనులు పూర్తి

గరుగుబిల్లి: ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో నిర్వహిస్తున్న నాడు - నేడు పనులను నిర్దేశిత సమయంలోగా పూర్తి చేయాలని ఐసీడీఎస్ పీఓ జి. సుగుణకుమారి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నాడు - నేడు పనులకు సంబంధించి ఇంజినీరింగ్ అధికారులు, ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కొమరాడ, గరుగుబిల్లి మండలాలకు సంబంధించి అంగన్‌వాడీ భవనాల మరమ్మతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. భవనాల మరమ్మతులను సకాలంలో పూర్తి చేసేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఏఓ ఎస్.అర్జునరావు, ఇంజినీరింగ్ అధికారులు జి. నారాయణస్వామి, ఎం. రామారావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఆర్. లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ సుగుణకుమారి

సమయ పాలన పాటించాలి

భామిని: మండలంలోని కాట్రగడ - బి, వడ్డంగి సచివాలయాలను ఎంపీడీఓ జె.ఉమామహేశ్వరి గురువారం సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. రోజు వారీ కార్యక్రమాలను పరిశీలించారు. సచివాలయ సిబ్బంది విధిగా సమయ పాలన పాటించాలన్నారు. హాజరు పట్టీలు సక్రమంగా ఉంచి క్రమపద్ధతిలో సంతకాలు చేయాలన్నారు. కార్యదర్శి కె.సంతోష్‌కుమార్, వీఆర్‌ఓ సీహెచ్ భారతి పాల్గొన్నారు.

ఆదివాసీలకు పథకాలు



గిరిజనులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఉమామహేశ్వరి

భామిని: ఆదివాసీ గిరిజనుల అభ్యున్నతికి చేపట్టిన కేంద్ర పథకాలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ జె.ఉమామహేశ్వరి గురువారం అన్నారు. ఈ మేరకు భామిని మండలంలోని మనుమకొండలో గురువారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉపాధి హామీ పథకం అమలు, ఉజ్వల గ్యాస్ పథకం, ఆయుష్మాన్ భారత్ కార్యక్రమాలపై వివరించారు. బత్తిలి వైద్యాధికారి డాక్టర్ కొండపల్లి ప్రతాప్ ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పత్తిక మురళి, సర్పంచ్ నిమ్మల కేశవ.హౌసింగ్ ఏఈ చంద్రశేఖరనాయుడులు పాల్గొన్నారు.

రాకపోకలకు అంతరాయం..



రోడ్డుపై పడిన చెట్టు కొమ్మ

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కొత్తగూడ సమీపంలో గల ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్డు మధ్యలో భారీ చెట్టుకొమ్మ పడిపోవడంతో గురువారం వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వెంటనే స్థానికులు స్పందించి చెట్ల కొమ్మలను తొలగించారు. దీంతో రాకపోలకు ఇబ్బందులు తప్పాయి.

మండలానికి చేరుకున్న క్రీడా పరికరాలు



క్రీడా పరికరాలను పరిశీలిస్తున్న ఎంపీపీ ఆదినారాయణ, ఎంపీడీఓ గీతాంజలి, తదితరులు

సీతంపేట: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం నిర్వహణకు సంబంధించిన క్రీడా పరికరాలు మండల పరిషత్ కార్యాలయానికి చేరుకున్నాయి. దీనిలో భాగంగా ఎంపీపీ బి.ఆదినారాయణ, ఎంపీడీఓ కె.గీతాంజలి పరికరాలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ, ఈ నెల 15 నుంచి సచివాలయ పరిధిలోను, అనంతరం మండల, జిల్లా స్థాయిల్లో ఆటల పోటీలు నిర్వహిస్తామన్నారు. క్రికెట్, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ డబుల్స్, కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆర్టీఏ అధికారులకు స్థలం అప్పగింత

గరుగుబిల్లి: ఆటోమెటిక్ డ్రైవింగ్ ట్రాక్ అవసరమైన స్థలాన్ని ఆర్టీఏ అధికారులకు తహసీల్దార్ జీవీ జనార్దన్ గురువారం అప్పగించారు. పార్వతీపురం మన్యం జిల్లా రవాణా శాఖ అధికారులకు మండలంలోని నాగూరు గ్రామ పరిధిలో వున్న ఐదెకరాల స్థలాన్ని ఆటోమెటిక్ డ్రైవింగ్ ట్రాక్ నిమిత్తం స్థలాన్ని కేటాయించారు. ఈ మేరకు ఉన్నతాధికారుల ఆదేశం మేరకు రవాణా శాఖాధికారి సి.మల్లికార్జున రెడ్డికి తహసీల్దార్ స్థలానికి సంబంధించిన దస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఉప తహసీల్దార్ టి.సత్యలక్ష్మికుమార్, ఆర్డీఓ కార్యాలయ ఏఓ జి.సీతారాం, ఎంవీ ఇన్‌స్పెక్టర్లు జి.సత్యనారాయణ, బి.కాశీరాంనాయక్, మండల సర్వేయర్ బి.శ్రీనివాసరావు, ఆర్‌ఐ ఎం.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



స్థలానికి సంబంధించిన దస్త్రాలను అందజేస్తున్న తహసీల్దార్ జనార్దన్

బాలలను పనిలో పెడితే చర్యలు

కురుపాం: బాలలను పనిలో చేర్చుకుంటే యజమానులపై చర్యలు తప్పవని పార్వతీపురం సహాయ కార్మిక అధికారి వెంకటేశ్వరరావు హెచ్చరించారు. మండల కేంద్రంలోని చైల్డ్ లేబర్ స్పెషల్ డ్రైవ్ గురువారం నిర్వహించారు. దుకాణాలకు వెళ్లి తనిఖీలు చేసి, అవగాహన కల్పించారు. బడి ఈడు పిల్లలు ఉండాల్సింది బడిలోనే కానీ బడి బయట కాదని బడి ఈడు పిల్లలను పనుల్లో చేర్చుకుంటే అటువంటి దుకాణ యజమానులపై కేసులు నమోదు చేపట్టి చర్యలు తీసుకుంటామని వ్యాపారులకు హెచ్చరించారు. తనిఖీల్లో ఆయనతో పాటు కార్మిక శాఖకు చెందిన జూనియర్ అసిస్టెంట్ రజిని పాల్గొన్నారు.



చైల్డ్ లేబర్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా దుకాణంలో అవగాహన కల్పిస్తున్న సహాయ కార్మిక అధికారి

ప్రజల జీవనోపాధులు పెంచాలి

వీరఘట్టం: ప్రజల జీవనోపాధులు పెంచేలా పనులు కల్పించాలని ఉపాధి హామీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ అశోక్‌కుమార్ అధికారులకు సూచించారు. వీరఘట్టం మండలం కుంబిడి, గంగమ్మపేట గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా సాగులో ఉన్న ఉద్యాన పంటలను గురువారం ఆయన పరిశీలించారు. వేతనదారులు ఆదాయ వనరులను పెంపొందించుకోవాలని సూచించారు. వేతనాదారులతో మాట్లాడి రోజు వారీ పని గంటలు వారికి వస్తున్న వేతనంపై ఆరా తీశారు. సొంత పొలాలు ఉంటే వాటిలో పండ్ల తోటలు పెంచుకోవాలని అందుకు ప్రభుత్వ సహకారం ఉంటుందని సూచించారు. భూములు ఉన్న రైతులు ముందుకు రావాలని కోరారు. ఆయనతో పాటు పార్వతీపురం మన్యం జిల్లా డ్వామా పీడీ రామచంద్రరావు, ఏపీఓ సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.



జీడితోటలు సాగుచేస్తున్న రైతులతో మాట్లాడుతున్న జాయింట్ సెక్రటరీ అశోక్‌కుమార్

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన : పీఓ

సీతంపేట: విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన జరగాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనా కుమారి అన్నారు. మల్లి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా చదువులో వెనుకబడిన విద్యార్థుల చదువులను పరిశీలించారు. వారితో గణితం, సైన్సు వంటి వాటిపై సాధన చేయించారు. ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వాసుదేవరావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థుల చదువులు పరిశీలిస్తున్న పీఓ కల్పనాకుమారి

'ఆడుదాం ఆంధ్రా'కు రిజిస్ట్రేషన్‌లు ప్రారంభం

పాలకొండ: ప్రభుత్వం చేపడుతున్న ఆడుదాం ఆంధ్రా క్రీడలకు సంబంధించి ఉత్సాహ వంతులు రిజిస్ట్రేషన్‌లు చేసుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు కోరారు. గురువారం ఆడుదాం ఆంధ్రా క్రీడా పరికరాలు సచివాలయాలకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు రకాల ఆటలకు సంబంధించి క్రీడా పరికరాలు సచివాలయానికి అందించామని తెలిపారు. 15సంవత్సరాలు దాటిన యువత తమ పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. వలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి ఈ కార్యక్రమంపై వివరిస్తున్నారని తెలిపారు.



ఆడుదాం ఆంధ్రాకు సంబంధించి సిబ్బందికి సూచనలు చేస్తున్న కమిషనర్

వైద్యశిబిరం విజయవంతం

గరుగుబిల్లి: మండలంలోని రావుపల్లి సత్యసాయి బాబా మందిరం ఆవరణలో గురువారం నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరం విజయవంతమైంది. సర్పంచ్ బి. మహేశ్వరరావు, ఆశయ హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరంలో శ్రీకాకుళం జిల్లా రాగోలు జెమ్స్ ఆస్పత్రి వైద్యసిబ్బంది రోగులకు తనిఖీలను నిర్వహించి అవసరమైన మందులను అందజేశారు. ఈ శిబిరానికి రావుపల్లి, కొత్తపల్లి, కొత్తూరు, తదితర గ్రామాలకు చెందిన రోగులు హాజరయ్యారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పి. రాజేశ్వరరావు, ఏరియా మేనేజర్ ఎం. రాజేష్, పీఆర్‌ఓ ఎ. రాజు, తదితరులు పాల్గొన్నారు.



రోగులకు మందులు అందజేస్తున్న సర్పంచ్ మహేశ్వరరావు

జగనన్నతోనే అభివృద్ధి..

ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగుతుందని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో చోటుచేసుకున్న అభివృద్ధి, ప్రజలకు అందిన సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు గత పాలకుల హయాంలో జరిగిన నిర్లక్ష్యాన్ని తెలియజేసేందుకు వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం వాడవాడలా వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాలు నిర్వహించారు. రానున్న రోజుల్లో జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వం రాష్ట్రానికి ఎందుకు అవసరమో ప్రజలకు వివరించారు. - పాలకొండ నెట్‌వర్క్



వీరఘట్టం: కిమ్మిలో మాట్లాడుతున్న ఎంపీపీ దమలపాటి, పక్కనే ఉన్న వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లీలా ప్రసాదరావు



భామిని: బత్తిలిలో సంక్షేమ జాబితా ఆవిష్కరిస్తున్న సర్పంచ్ టింగ శాంతికుమారి,కోఆప్టన్ సభ్యులు విశ్వనాథ పట్నాయక్, తదితరులు



పాలకొండ రూరల్: భాసూరులో ప్రజలకు బుక్‌లెట్లు అందిస్తున్న ఎంపీపీ భాను, సర్పంచు మల్లేశ్వరమ్మ, తదితరులు